సమస్యల నడుమ చదువులు

- కనీస సౌకర్యాలు లేని ఆనందపురం జూనియర్ కాలేజీ
- ఎనిమిది గ్రూపులకు గాను రెండింటిలో ప్రవేశాలు
- 26 మంది విద్యార్థులకు రెండే గదులు
- రెగ్యులర్ అధ్యాపకులు నిల్
- వేరే కాలేజీల్లో ప్రాక్టికల్ తరగతులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు



కళాశాలలో చదువుతున్న మొత్తం విద్యార్థులు వీరే

తగరపువలస: ఆనందపురం జూనియర్ కళాశాల సమస్యలతో కునారిల్లుతోంది. ఇక్కడ ఎనిమిది గ్రూపులున్నా రెండు గ్రూపుల్లో ప్రస్తుతం 26 మంది విద్యార్థులున్నారు. వీరికి కేవలం రెండే రెండు



అధ్యాపకులకు కేటాయించిన హాల్

తరగతి గదులు ఉన్నాయి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, వసతులు లేకపోవడంతో ఈ కళాశాలలో చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. చేరిన వారిలో కూడా ఐదుగురు విద్యార్థులు కళాశాల రావడం లేదు. ఎనిమిది గ్రూపులకు గాను ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లోనే విద్యార్థులు చేరారు. ఈ రెండు గ్రూపులకు సంబంధించి మొదటి, రెండో సంవత్సరం తరగతులు ఇక్కడ నిర్వహిస్తున్నారు. మొత్తం నాలుగు తరగతుల నిర్వహణకు కనీసం నాలుగు గదులు, ఒక స్టాఫ్ రూం, ల్యాబ్, గ్రంథాయలం ఉండాలి. కానీ రెండు తరగతి గదులు, స్టాఫ్ కూర్చునేందుకు ఒక హాల్ మాత్రమే ఉన్నాయి.

2019–2020 విద్యాసంవత్సరంలో అక్కడి జెడ్పీహైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్



ఆనందపురం జెడ్పీహైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలోనే ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఎల్‌టీ, ఏఈటీ గ్రూపుల్లో 80 వరకు విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. కోవిడ్ కారణంగా వరుసగా రెండేళ్ల సక్రమంగా తరగతులు జరుగకుండానే గడచిపోయాయి. రెండు తరగతి గదులు, హాలు మాత్రమే కళాశాలకు అందుబాటులో ఉండడంతో విద్యార్థుల ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ప్రస్తుతం ఫైనలియర్ ఎంపీసీలో ఏడుగురు, సీఈసీలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది ఫస్టియర్ ఎంపీసీలో నలుగురు, సీఈసీలో 9 మంది విద్యార్థులు చేరినా వీరిలో ఐదుగురు విద్యార్థులు కళాశాల ముఖమే చూడలేదు. ప్రాక్టికల్స్ కోసం భీమిలి, మధురవాడ కళాశాలలకు ఎంపీసీ విద్యార్థులు వెళ్లవలసి వస్తోంది. ఇక్కడ ఉత్తర్ణీత శాతం కూడా చాలా స్వల్పంగా ఉంది. ప్రస్తుతం స్వీపర్ కూడా లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులే ఆ పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడున్న రెండు తరగతి గదులు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు దుర్గంధం కారణంగా విద్యార్థులు కళాశాలకు రెగ్యులర్‌గా రావడానికి మొగ్గ చూపడం లేదు. వసతులు లేమి కారణంగా ఈ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారు. ఆర్థికంగా భారం పడుతున్న ప్రైవేట్ కళాశాలల్లో చేరుతున్నారు.

స్థలం కేటాయించినా..

జెడ్పీహైస్కూల్‌కు ఆనుకుని కళాశాల నిర్మాణానికి గత ప్రభుత్వం 2.40సెంట్ల స్థలాన్ని కేటాయించింది. అయితే ఇంకా భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఈ స్థలంలో కళాశాల భవనాలను నిర్మించడంతో పాటు కళాశాల నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, ల్యాబ్, తాగు నీరు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు మండల ప్రజలు కోరుతున్నారు.



జెడ్పీహైస్కూల్ పక్కనే జూనియర్ కళాశాలకు కేటాయించిన స్థలం

అందరూ గెస్ట్ లెక్చరర్లే

కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లను నియమించలేదు. తెలుగు, ఇంగ్లిషు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ బోధించడానికి గెస్ట్ లెక్చరర్లు అందుబాటులో ఉన్నారు. వీరికి ఈ ఏడాది గౌరవ వేతనాల బకాయిలతో పాటు గతంలో కొన్ని బకాయిలు చెల్లించలేదు.

అపరిశుభ్రంగా పరిసరాలు



కళాశాలలో కనీస సౌకర్యాలు లేవు. తరగతి గదులు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తీవ్ర దుర్గంధం మధ్య చదువుకోవలసి వస్తోంది. మా కాలేజీ గురించి పట్టించుకునే నాథుడే కరవయ్యారు. గత ప్రభుత్వం హయాంలో మా కళాశాల విద్యార్థులకు అమ్మ ఒడి పథకం మంజూరయ్యేది. ఇప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా అమ్మకు వందనం అమలు చేయాలి. – సుంకర ఉదయకుమార్, విద్యార్థి, దండువారి కళ్లాలు

వసతులు కల్పించాలి..



మా కాలేజీలో ఎలాంటి వసతులు లేవు. కళాశాలకు స్థలం కేటాయించినందున కూటమి ప్రభుత్వం అందులో భవనాలు నిర్మించి, వసతులు కల్పిస్తే కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. లేదంటే ప్రైవేట్ కళాశాలలకే దిక్కు.

– లంకలపల్లి మోహనకృష్ణవేణి, ఎస్సీబీసీ కాలనీ

నేడు శ్రీసామ్రాజ్య లక్ష్మీదేవి పట్టాభిషేకం

తగరపువలస: కార్తీకమాస శుక్ల ఏకాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు తగరపువలస శివారు బంగ్లామెట్ట మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ ఫ్యాక్టరీ ఆవరణలో శ్రీసామ్రాజ్య లక్ష్మీదేవి పట్టాభిషేకం నిర్వహించనున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరి జిల్లా మధుగిరిలో అతి పురాతనమైన శ్రీసామ్రాజ్య లక్ష్మీదేవి ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా ఈ పట్టాభిషేకం నిర్వహించనున్నారు. సిద్ధయోగి కృపానిధి గురు మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో భాగంగా 108 మంది మహిళలతో శ్రీలలితా సహస్ర నామ పారాయణం, హిమాలయ పుణ్యనదుల జలములతో అభిషేకం, పుష్పాభిషేకం జరపనున్నారు. అంతకు ముందు అంబేడ్కర్ కూడలిలో ఆంజనేయస్వామి ఆలయం నుంచి కేరళ బ్యాండ్, అమ్మవారి శరణుఘోషతో బంగ్లామెట్ట వరకు శోభాయాత్ర నిర్వహించనున్నారు. లోక కల్యాణార్థం తగరపువలసతో పాటు దేశంలోని 108 ప్రాంతాల్లో ఈ పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి



భీమిలి ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న కొండపేట యువకులు

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి జీవీఎంసీ ఒకటోవార్డు కొండపేటకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ స్థానిక యువకులు భీమిలి ఎక్సైజ్ అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సామంతుల సత్తిరాజు, తాటిపూడి అప్పలరాజు, మామిడి శివ, గంటా నరసింగరావు, పందిరి కన్నారావు, కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై శిక్షణ

పద్మనాభం: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ ఇవ్వనున్నట్టు మండల పరిషత్ పరిపాలనా అధికారి జయ ఉమ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న ఈ శిక్షణకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తగనపువలస: ఆనందపురం మండలం పరదేశిపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. బోయపాలెం, గంభీరం, కల్లివానిపాలెంలోని గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని విశాఖ జోన్-3 ఈఈ(ఆపరేషన్) పి.శ్రీనివాసరావు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీయే అంగన్‌వాడీల లక్ష్యం



మాట్లాడుతున్న పీవో శ్రీదేవి, సూపర్‌వైజర్ ప్రమీల

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ప్రభుత్వం నుంచి అందుతున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయడమే లక్ష్యంగా అంగన్‌వాడీలు పనిచేయాలని ఐసీడీఎస్ భీమిలి పీవో శ్రీదేవి అన్నారు. 'అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు ఆమె స్పందించారు. సోమవారం సూపర్‌వైజర్ ప్రమీలతో కలిసి చిల్లపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా పంపిణీ అయిన పదార్థాలను ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

కొండ పోరంబోకు స్థలంలో ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్‌తో పునాదులు తొలగిస్తున్న సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం పంచాయతీ గంగసాని అగ్రహారం సర్వే నంబర్ 1 కొండ పోరంబోకు స్థలంలో ఆదివారం నలుగురు వ్యక్తులు పునాదులు నిర్మించారు. వీరిలో ఒకరు షెడ్డు కూడా నిర్మించారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ ఉమాదేవి, వీఆర్వో జి.వరహాలు, సర్వేయర్ రఘురామ్ సోమవారం విచారించగా వారికి ఇదివరకే ఇళ్లు ఉన్నట్టు గుర్తించారు. దీంతో జేసీబీతో పునాదులు, షెడ్డు తొలగిస్తుండగా ఒకరు వారిపై దాడికి ప్రయత్నించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆనందపురం పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతరం వారిసాయంతో ఆక్రమణలు తొలగించారు.

సుఖీభవ కాలనీ వద్ద సెల్ టవర్ వద్దు



వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

తగరపువలస: భీమిలి జోన్ 1,2 వార్డుల పరిధి బొగ్గులరోడ్డు వద్ద సుఖీభవ కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలని స్థానికులు సోమవారం జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా టవర్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు చేరుకుని ఫిర్యాదు చేసిన వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ఇరువర్గాలకు నచ్చచెప్పి పంపించారు. ఉన్నతాధికారులదృష్టికి ఈసమస్యను తీసుకువెళతామన్నారు.

హరుడికి ఆదిత్యుడి కిరణాభిషేకం

- మానం ఆంజనేయులు కాలనీ శివాలయంలో అపూర్వ ఘట్టం
- దర్శించుకుని ఉప్పొంగిన భక్తజనం



శివ లింగాన్ని తాకిన సూర్యకిరణాలు

మధురవాడ: స్థానిక ఐటీ సెజ్‌లోని మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీలలితా త్రిపుర సుందర సమేత మహా కామేశ్వరస్వామి ఆలయం సోమవారం అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. కార్తీక సోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో ఆలయానికి చేరిన భక్తులు పూజ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న సమయంలో సరిగ్గా ఉదయం 6.41నిమిషాలకు సూర్యకిరణాలు ఒక్కసారిగా శివలింగంపై ప్రసరించాయి. తిలకించిన భక్తులు పారవశ్యంతో ఉప్పొంగిపోయారు. అనంతరం ఆలయంలో స్వామికి ఆలయ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అర్చకులు అంపోలు వెంకట రమణమూర్తి శర్మ ప్రత్యేక పూజలు చేశారు.

మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయంలో జీవీఎంసీ జోన్-2 కమిషనర్ పి.సింహాచలం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యులు సతీష్, నాగోతి సూర్యప్రకాశరావు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు దూసి రామలింగస్వామి శివునికి అభిషేకాలు నిర్వహించారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలి



భీమిలిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

తగరపువలస/భీమునిపట్నం: నిత్యావసర సరుకులు ధరలు, ఇంధన ధరలు తగ్గించడంతో పాటు సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై ప్రచార కార్యక్రమంలో భాగంగా భీమిలి డివిజన్ సీపీఎం ,సీఐటీయూ నాయకులు సోమవారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు గాంధీబొమ్మ వీధి, భీమిలిలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సమస్యలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, జీరు సత్యారావు, నరసింగరావు, ముత్యా,ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ముచ్చటగా మూడు అర్జీలు

- జెడ్సీ డుమ్మా



ఖాళీగా ఉన్న జోనల్ కమిషనర్ కుర్చీ

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ముచ్చటగా మూడే మూడు అర్జీలు వచ్చాయి. ఎప్పుడూ సాధారణంగా 10పైనే అర్జీలు వచ్చేవి. వీధిలైట్ల ఏర్పాటు, చిన్న చిన్న రిపేర్లు పనులకు కూడా అధికార యంత్రాంగం చేతులెత్తేయడంతో ఫిర్యాదులు చేసేందుకు ఎక్కువ మంది రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జోనల్ కమిషనర్ సింహాచలం కూడా కార్యక్రమానికి హాజరుకాలేదు. ఈఈ శాంతి రాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఏళ్ల తరబడి వినతులు ఇస్తున్నా షిప్‌యార్డ్ లేఅవుట్ పార్కులో ఆక్రమణలు తొలగించడం లేదని కాలనీ వాసులు అర్జీ అందజేశారు. సర్వే నంబర్ 281/8, 9, 10 ఎల్‌పీ నంబర్ 24/94లో పార్కులో అక్రమంగా నిర్మించిన షెడ్‌లు తొలగించాలని చోడవరపు కరుణసాగర్ తదితరులు ఫిర్యాదుచేశారు. వల్లీనగర్ ఆర్టిస్ట్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్ దగ్గర ఉన్న కల్వర్టు పాడవంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని శ్రీనివాసచంద్ర అర్జీ అందజేశారు.

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చింది.

పోలీస్ బందోబస్తు నడుమ సర్వే



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: బాందేవుపురంలో గతంలో పంచాయతీ భవనం ఉండే స్థలాన్ని సోమవారం పోలీస్ బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. గతంలో పంచాయతీ భవనం ఉన్న స్థలం తనదని రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి భవనాన్ని తొలగించాడు. దీంతో ఇది వివాదాస్పదంగా మారింది. పంచాయతీ భవనం ప్రాంతం సుమారు 40 సెంట్లు ఉంది. ఇక్కడ గ్రామస్తులకు ఉపయోగించుకోవాడనికి వీలుగా కల్యాణ మండం నిర్మించడానికి నిర్ణయించారు. తనకు ఉన్న జిరాయతీ భూమితో పాటు పంచాయతీ భవనం ఉండే గ్రామ కంఠం స్థలాన్ని ఆ వ్యక్తి అమ్మేసినట్టు కొందరు కలెక్టర్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ బందోబస్తు నడుమ ఆ స్థలాన్ని సర్వే చేయించారు. గ్రామ కంఠమా? జిరాయితీయా? అన్న విషయాన్ని నిర్ధారించడానికి ఈ సర్వే చేశారు.

అంతర రాష్ట్ర ఓపెన్ కరాటేలో కేథరిన్ విద్యార్థి ప్రతిభ



పతకాలతో లోహిత్ పాత్రుడు

తగరపువలస: నగరంలోని మద్రిపాలెం రైల్వే కాలనీలో ఆదివారం జరిగిన అంతర రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024లో భీమిలి కేథరిన్ విద్యా సంస్థలకు చెందిన 8వ తరగతి విద్యార్థి లింగిపల్లి లోహిత్ పాత్రుడు బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. 30 కిలోల విభాగంలో కాటాలో కాంస్య, కుంతేలో బంగారు పతకాలు సాధించాడు. వీటిని సినీహీరో సుమన్ చేతుల మీదుగా పాత్రుడు అందుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ రాయి పాత్రునితో పాటు కోచ్ బి.వి.అప్పారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాత్రుడు కుటుంబ సభ్యులు లింగిపల్లి రామారావు, పుష్పలత, పిల్లా అప్పారావు, రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివోహం.. భజేహం

- వైభవంగా కార్తీక మాస రెండో సోమవారం పూజలు
- కిటకిటలాడిన శివాలయాలు
- ప్రతిధ్వనించిన పంచాక్షరీ



పూజలందుకున్న శివయ్య



అలంకరణలో కాశీ ఉమామహేశ్వరస్వామి



సంగివలస పురాతన ఉమా రామలింగేశ్వర ఆలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



భీమిలిలో ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు



గుడిలోవ రంగనాథస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

తగరపువలస: కార్తీక మాస రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయాల వద్ద బారులు తీరారు. మహాదేవునికి అర్చనలు, మహా న్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవలోని కొండపై వెలసిన శ్రీరంగనాథ స్వామి, నారాయణేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలసలోని పురాతన ఉమారామలింగేశ్వర ఆలయం, తాటితూరులోని ఉత్తర రామలింగేశ్వర ఆలయంలలో భక్తుల కోసం దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. చిట్టివలస జ్యూట్‌మిల్లు శివాలయం, కొండపేట, విల్సన్‌పేట, బంగ్లామెట్ట, సంతపేట, సంగివలస కాలనీ, మూలకుద్దు, లక్ష్మీపురం, అమనాం, బసవపాలెం, టి.నగరపాలెం, తాళ్లవలస పంచాయతీల్లోని శివాలయాలలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. శివనామస్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. గుడిలోవలో జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు రాజశేఖర్, శ్రీనివాసరావు, రామలక్ష్మి, రాము, శ్రీను భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కొమ్మాది: కార్తీకమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు.కొమ్మాది అన్నంరాజునగర్‌లో గల మంగళగౌరీ సమేత వైశాఖేశ్వరస్వామి ఆలయం, హంసవన పుణ్యక్షేత్రం రామాద్రి శివాలయం, ఎండాడ శివాలయంలలో వేకవ జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి వద్ద కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయానికి తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే భక్తుల తాకిడి మొదలైంది. పెద్ద ఎత్తున బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. బక్కన్నపాలెం రోడ్డులోగల శ్రీ శృంగేరీ శంకర మఠంలోని శివాలయంలో కూడా అధిక సంఖ్యలో భక్తులు స్వామికి అభిషేకాలు చేశారు.

భీమునిపట్నం:స్థానిక పురాతన శివాలయాలకు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఇక్కడి చోడేశ్వర, భీమేశ్వర, చంద్రశేఖర ఆలయాలకు ఉదయం నాలుగు గంటల నుంచే పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, పూజలు చేశారు. ఈ ఆలయాల ప్రాంగణంలో నంది, రావిచెట్టు వద్ద మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పద్మనాభం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పద్మనాభం, కురపల్లి, పొట్నూరు, తునివలస, విలాస్కాన్‌పాలెం, రెడ్డిపల్లి, అనంతవరం దార కొండపై శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

స్తంభం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

తగరపువలస: అంబేడ్కర్ కూడలిలో సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన స్తంభాన్ని భీమిలి ట్రాఫిక్ పోలీసులు సోమవారం యంత్రాల సాయంతో తొలగించారు. స్తంభం అడుగు భాగం తుప్పు పట్టిపోవడంతో సగం వరకు పట్టు తప్పిఉంది. పలువురు ఆందోళన వ్యక్తం చేయడంతో 'కూలేందుకు సిద్ధంగా స్తంభం' శీర్షికతో గత నెల 21న 'సాక్షి'లో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదు. ఉన్నతాధికారుల సూచనలతో ప్రత్యామ్నాయంగా మరో స్తంభం ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు తెలిపారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతికుమారి



ఆదర్శహిందీ ప్రేమీ మండలి కార్యాలయంలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: భారత దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆజాద్ జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఆజాద్ పోరాట స్ఫూర్తి వెలకట్టలేనిదని చెప్పారు. తన దూరదృష్టితో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ఆయన చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. విద్య విధానంలో ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. అధ్యాపకులు ఎల్.సుధాకర్, జి.జి.ఎస్. నాగేశ్వరరావు, గొట్టేటి రవి, జె.మాధవి, ఎస్.త్రినాథరావు, ఆర్.నీలిమ పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆజాద్‌కు నివాళులర్పించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం ఆజాద్


తగరపువలస: మాజీ ప్రధాని నెహ్రూ మంత్రి వర్గంలో మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన అబుల్ కలాం ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. సోమవారం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. అబుల్ కలాం ఆజాద్ గురించి విద్యార్థులకు వివరించారు. మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



ప్రతిష్టించడానికి సిద్ధం చేసిన పూర్ణ కలశం

పద్మనాభం: మద్దిలోని సాగర దుర్గ ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రాంభమయ్యాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం అమ్మ వారి ఉత్సవ మూర్తులు, శిఖర పూర్ణ కలశాన్ని కోలాటం తదితర సాంస్కృతి కార్యక్రమాల నడుమ గ్రామంలో ఊరేగించారు. తదుపరి రక్షా బంధనం, యాగ శాల ప్రవేశం, అఖండ దీపారధన, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.



ఊరేగింపులో కోలాటం